క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రాజేందర్

కాగజ్‌నగర్‌టౌన్: ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ అన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వార్డు నం. 18, 23, 29 వార్డుల్లో పర్యటించి పట్టణవాసులకు అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలోని చెత్త కుండీలు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీ భవనం ముస్తాబు



ముస్తాబైన ఆదివాసీ భవన్

కెరమెరి: నేడు నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్ ముస్తాబైంది. రెండు రోజుల నుంచి ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు దగ్గరుండి పనులు చేయించారు. ఇప్పటికే మండలంలోని అధికారులతో పాటు వివిధ సంఘాల నాయకులకు ఆహ్వాన పత్రాలు అందించారు. మండలంలోని జోడేఘాట్‌లో కూడా ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి.

నానో యూరియాపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏవో రామకృష్ణ

కాగజ్‌నగర్‌టౌన్: రైతులు నానో యూరియాను వాడాలని ఏవో రామకృష్ణ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. షాపులకు వచ్చిన రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. నానో యూరియా వాడడం వల్ల అధిక దిగుబడితో పాటు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. పంటలకు మందులు పిచికారీ చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఎరువులు, మందులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయించే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. నానో యూరియా స్టాక్‌ను డీలర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని బ్యాంక్ మేనేజర్లు సుమిద్, అమ్రేష్ పాండ్యాలు అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని కోసిని, ఊటీపల్లి గ్రామాల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోసిని, చింతగూడ, కాగజ్‌నగర్ బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్లు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, బీమా పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సూరజ్, బ్యాంక్ మిత్రలు రామానుజం, రవి ప్రసాద్, జాగ్రావు, శ్యాంసుందర్, జుమిడి రాజు, సుర్పం రామ్‌షా, నగునూరి శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

'శ్యాంనాయక్ జాగ్రత్తగా మాట్లాడాలి'



మాట్లాడుతున్న భరత్

కెరమెరి: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై శ్యాంనాయక్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడ్డం సరికాదని, అలా మాట్లాడితే ఊరుకునేది లేదని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావిభరత్ భూషణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ పెత్తనం చలాయిస్తామంటే చెల్లదన్నారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, తుడుందెబ్బ నాయకులు కుడ్మెత సోము, కినక సకారాం, సిడాం భీంరావు, కోట్నక సకారాం, మడావి రాజు, టేకం భీంరావు తదితరులు ఉన్నారు.

తీజ్ సంబరాలు షురూ..!

ఏటా వైభవంగా జరుపుకునే తీజ్ సంబరాలు లింగాపూర్ మండలంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. తీజ్ ఉత్సవాల్లో భాగంగా పెళ్లికాని యువతులు 9 రోజుల పాటు ఉపవాసం ఉండి ఏడుగురు దేవతలను నియమనిష్ఠలతో పూజిస్తారు. ముందుగా గ్రామ నాయక్ ఇంటి వద్ద పుట్ట మట్టి, గోధుమలతో సిద్ధం చేసిన బుట్టలను మంచెపై ఉంచుతారు. తొమ్మిది రోజులపాటు ప్రతీరోజు ఉదయం, సాయత్రం దప్పు చప్పుళ్లతో గ్రామ శివారులో ఉండే జగదాంబ దేవి ఆలయంలో పూజలు చేసి అక్కడి నుంచి నీటిని తీసుకొచ్చి బుట్టలపై చల్లుతారు. సంబరాల్లో యువతుల తల్లిదండ్రులతో పాటు గ్రామ యవకులు పాల్గొని నృత్యం చేస్తారు.

– లింగాపూర్



గ్రామ నాయక్ ఇంటి వద్ద గుమిగూడిన మహిళలు, యువతులు



బుట్టలు సిద్ధం చేస్తున్న మహిళలు



మంచెపైకి బుట్టలు అందిస్తున్న యువతులు



మంచెపై తీజ్ బుట్టలు

'తీజ్ పండుగ అధికారికంగా నిర్వహించాలి'



మాట్లాడుతున్న రూప్‌లాల్

కెరమెరి: బంజారాలు ఏటా ఘనంగా నిర్వహించే తీజ్ పండుగను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దేవాపూర్‌లో ఆయన మాట్లాడారు. దీక్షభూమి కొత్తపల్లి అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయాలని, రాంరావు మహరాజ్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంత్ ప్రేంసింగ్ మహరాజ్ జన్మదినం సందర్భంగా గురుపౌర్ణమి రోజున కొత్తపల్లిల జరిగే కార్యక్రమానికి అందరూ హాజరు కావాలన్నారు.

'ఆదివాసీ ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదు'



మాట్లాడుతున్న కోట్నాక విజయ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదివాసీ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్‌కు లేదని ఆదివాసీ పోరాట హక్కుల సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ ఎమ్మెల్యేను అవమానపర్చేలా మాట్లాడటం శ్యాంనాయక్ అహంకారానికి నిదర్శనమన్నారు. పార్టీల పరంగా వైరం ఉన్నా ఆదివాసీల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాసే అధికారులు తీరు మార్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోవ విజయ్‌కుమార్, నాయకులు బుర్స పోచయ్య తదితరులు ఉన్నారు.

'ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న లంబాడా నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌పై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి వెంటనే క్షమాపణలు చెప్పాలని గిరిజన లంబాడాల ఐక్య వేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ వసంత్‌రావు, లైవ్ జిల్లా ఇన్‌చార్జి బానోత్ రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి తీరును ఖండించారు. వారు మాట్లాడుతూ బంజారా సమాజంతోనే ఎమ్మెల్యేగా గెలిచి, నేడు లంబాడా బిడ్డపై దాడి చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే హోదాలో ఉండి ఇలా ప్రవర్తించడం సరికాదని హితవు పలికారు. క్షమాపణలు చెప్పేవరకు బంజారా నాయకులు ఎమ్మెల్యేతో కలిసి గ్రామాల్లో తిరగకుండా చేస్తామన్నారు.

ఎస్టీఎఫ్ఐ రజతోత్సవ మహాసభలకు హాజరు



మహాసభలకు హాజరైన వైద్య శాంతికుమారి

కాగజ్‌నగర్‌టౌన్: కోల్‌కత్తాలో నిర్వహించిన స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రజతోత్సవ మహాసభలకు తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి శుక్రవారం హాజరయ్యారు. ఆగస్టు 8, 9, 10 మూడు రోజులు నిర్వహించే మహాసభల్లో జాతీయ విద్యావిధానం 2020పై చర్చతో పాటు విద్యారంగంలో జరుగుతున్న పరిణామాలు, పాత పింఛన్ అమలు, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, మినిమం పే స్కేల్, విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపు వంటి అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు.

పేకాడుతున్న ముగ్గురిపై కేసు



పేకాటరాయుళ్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సాలేగూడ గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వసక పాండురంగ్, కావుడే తిరుపతి, పుంజిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.800 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంజీవ్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

ముందస్తు రాఖీ వేడుకలు



కౌటాల: భారతి విద్యామందిర్‌లో రాఖీ వేడుకలు



ఆసిఫాబాద్‌రూరల్: రాఖీ కడుతున్న విద్యార్థులు

కౌటాల: మండల కేంద్రంలోని భారతి విద్యామందిర్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి ఆశీస్సులు తీసుకున్నారు. కాగా మండల కేంద్రంలోని పలు షాపుల్లో మహిళలు రాఖీలు, మిఠాయిలు కొనుగోలు చేశారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, షీటీం సభ్యురాలు స్వప్న బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు రక్షాబంధన్ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లకు, ఆర్టీసీ డీఎం, కలెక్టరేట్ కార్యాలయం, పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టారు.

రాఖీ సందడి



రాఖీ దుకాణం వద్ద జనం



బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం మార్కెట్‌లో సందడి నెలకొంది. ప్రధాన మార్కెట్ ఏరియాలోని రోడ్డు వెంట రాఖీ దుకాణాలు వెలిశాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి రాఖీలు కొనుగోలు చేశారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి పట్టణాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులతో బస్టాండ్‌లో రద్దీ పెరిగింది.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



ఆసిఫాబాద్: శిశుమందిర్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

ఆసిఫాబాద్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీ, వాసవీ మందిరంతో పాటు జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు జరుపుకున్నారు. పట్టణంలోని వాసవీ మందిరంలో వాసవీ మాతకు ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం జరుపుకున్నారు.

'మన అమ్మకు మన సారె'..

జిల్లా కేంద్రంలోని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని 'మ న అమ్మకు మన సారె' కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ వాసవీమాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం సమర్పించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాత శ్రీనివాస్, ముక్క కృష్ణమూర్తి, కోషాధికారి కట్కూరి కిశోర్, క్లబ్ ప్రతినిధి ఎకిరాల శ్రీనివాస్, తాటిపెల్లి అశోక్, రావుల శంకర్, రవీందర్, ప్రశాంత్, నాగేశ్, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో మహిళలు శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ద్వారకానగర్, ఆదర్శనగర్ పాఠశాలల్లో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచార్యులు, మహిళలు నిర్వహించారు. శ్రీ సరస్వతీ శిశుమందిరాల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కొత్తపల్లి అనిత, జిల్లా కార్యదర్శి హనుమండ్ల రాజన్న, సభ్యులు నులిగొండ భారతి, పాఠశాల కార్యదర్శి ఇందూరి వెంకటేశ్, మహిళలు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని భక్తులు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినం పురస్కరించుకుని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. లక్ష్మీదేవికి రకరకాల నైవేద్యాలు, పూలు, పండ్లు, వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. కాగా నంబాలలో గల ప్రసన్న పరమేశ్వర ఆలయం, గంగాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి, ఇందిరానగర్ లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



రెబ్బెన: కనకదుర్గాదేవి ఆలయంలో ..



కెరమెరి: మంగళహారతులు ఇస్తున్న మహిళలు

కెరమెరి: వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ సీతారాములు, దుర్గాదేవి ఆలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతానికి, కుంకుమ పూజలకు మండల కేంద్రంలోని వివిధ వాడలకు చెందిన మహిళా భక్తులు తరలివచ్చారు. పురోహితుడు కులకర్ణి బాపూదేవ్ పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మంగళహారతులిచ్చారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నదానం నిర్వహించారు.

కౌటాల: మండల కేంద్రంలోని కంకలమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించారు. ఆలయంలో కంకలమ్మ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రకాశ్ ఆధ్వర్యంలో మహిళలు వరలక్ష్మి వత్రం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌టౌన్: హారతి ఇస్తున్న మహిళలు



వాసవీమాతకు సారె సమర్పిస్తున్న భక్తులు



కౌటాల: పూజలు చేస్తున్న భక్తులు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న రమేశ్

కౌటాల: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని తెలిపారు. ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని, మానసిక ఒత్తిడి జయించాలన్నారు. ఎంఈవో గావుడే హన్మంతు, సెక్టోరల్ అధికారి అబిద్‌అలీ, ఎస్‌వో పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

12న వాహనాల వేలం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 12న పట్టణంలోని కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ సమక్షంలో వేలం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెండో రోజు విధుల బహిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మూడేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని శుక్రవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌తో ఆసుపత్రి సూపరింటెండెంట్ కుమ్మక్కై కాలపయాపన చేస్తున్నారన్నారు. గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు రావాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్, నాలుగు నెలల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము, ఇమ్రాన్, సాయి, తిరుమల, పుష్ప, మీనాక్షి, రాజేశ్, నరేశ్, శారద ఉన్నారు.

అత్యవసర సిబ్బంది అందుబాటులో ఉండాలి

కాగజ్‌నగర్‌టౌన్: అత్యవసర సేవలు 108, 102 వాహనాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఈఎంఐ 108 రాష్ట్ర ఉన్నతాధికారి డాక్టర్ బాగేష్ మిశ్రా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్‌లు శుక్రవారం అన్నారు. వారు జిల్లాలోని 108, 104 పశుసంచార వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో ఎమర్జెన్సీకి సంబంధించిన పరికరాలు, మందులు, ఆక్సిజన్ వంటి సదుపాయాలు పరిశీలించారు. ఫోన్ కాల్స్ వస్తే వెంటనే స్పందించాలని సూచించారు. వీరి వెంట కోఆర్డినేటర్ సతీశ్, 108 సిబ్బంది ఉన్నారు.

బీహార్‌లో తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

ఆసిఫాబాద్: బీహార్‌లో తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఓట్లు రద్దు చేశారని ఆరోపించారు. పార్టీ నాయకులు కోట శ్రీనివాస్, గొడిసెల కార్తిక్, అశోక్, మాలాశ్రీ, నైతం రాజు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న తహసీల్దార్



అమ్మవారిని దర్శించుకుంటున్న తహసీల్దార్ సూర్యప్రకాశ్

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయాన్ని శుక్రవారం తహసీల్దార్ సూర్యప్రకాశ్ సందర్శించారు. కనకదుర్గామాతతో పాటు స్వయంభూగా వెలిసిన మహంకాళి అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ విశిష్టత, అమ్మవారు కొలువైన తీరును అడిగి తెలు సుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వి నోద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతి గౌడ్‌లు తహసీల్దార్‌కు అమ్మవారి కండువాతో పా టు ప్రతిమ అందజేశారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ ప్రేం కిరణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.